నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, గురువారం 27 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI




మాదక ద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ హనుమంతు కే. జెండగే

# యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దు

- భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి
- డ్రగ్స్ వాడకంతో ఎన్నో దుష్పరిణామాలు
- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, జూన్ 26 : యువత చెడు అలవాట్లకు లోనుకావద్దని, తమ జీవితాన్ని ఆగం చేసుకోవద్దని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం – అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని భువనగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ, ఎక్సైజ్, మెడికల్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకర ఆలోచనలతో ముందుకు సాగాలని, మంచి దారిలో నడిచి జీవితంలో విజయం సాధించాలని అన్నారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన డ్రగ్స్ గ్రామాల్లోకి పాకడం బాధాకరమని పేర్కొన్నారు. డ్రగ్స్ వాడకంతో కుటుంబాలకే కాకుండా సమాజానికి తీవ్ర నష్టమని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారిని గమనిస్తుండాలని సూచించారు. అందరం కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిద్దామని పిలుపునిచ్చారు.

కలెక్టర్ హనుమంతు కే. జెండగే మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వ్యవస్థను నాశనం చేస్తాయని, డ్రగ్స్ వాడకంతో ఆరోగ్యపరంగా, ఆర్థిక, సామాజిక పరంగా ఎన్నో దుష్పరిణామాలు ఉంటాయని అన్నారు. డ్రగ్స్ వినియోగం, రవాణా గురించి తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 14416కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా గ్రామ స్థాయిలో యాక్షన్ ప్లాన్ తయారు చేశామన్నారు. డ్రగ్స్ వినియోగం పట్ల ఎన్‌డీపీఎస్ యాక్ట్ అమలులో ఉన్నదని, కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు పాజిటివ్ ఆలోచనలతో చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. అంతకుముందు మాదక ద్రవ్యాల వాడకంతో జరిగే నష్టాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పనిచేస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాల హానికర ప్రభావాల పట్ల జాగ్రత్తలు, అవగాహన కలిగించే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీపీ నరాల నిర్మల, జడ్పీటీసీలు బీరు మల్లయ్య, అనూరాధ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జయశ్రీ, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి రమణి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాపారావు, డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ శిల్పి, సైక్రియాటిస్ట్ డాక్టర్ ప్రీతిస్వరూప్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కౌన్సిల్ జయపాల్, కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, సఖి ఎన్‌జీఓ డాక్టర్ ప్రమీల, ఎన్‌జీఓ కరణ్ పాల్గొన్నారు.

# శాలిగౌరారం ఎస్‌ఐపై విచారణ

నీలగిరి, జూన్ 26 : తన సమస్యలపై ఫిర్యాదు చేయడానికి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళితే ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ అసభ్యకరంగా ప్రవర్తించాడని శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామానికి చెందిన ఓ మహిళ ఆరోపించింది. ఈ విషయంపై నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు సదరు మహిళ ఫిర్యాదు చేయగా.. ఆయన ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. విచారణ కమిటీ సభ్యులు బుధవారం శాలిగౌరారం వెళ్లి అక్కడ జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితురాలితోపాటు మరి కొంత మందిని సాక్షులను విచారించినట్లు, ఎస్‌ఐ వివరణ తీసుకున్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసిన కాపీలను, గతంలో ఆయన వివరాలను కూడా విచారణ అధికారులకు అందజేశారు. జిల్లా ఎస్పీకి ప్రత్యేక నివేదిక సమర్పించినట్లు విచారణ బృందం సభ్యులు తెలిపారు. కాగా, బాధితురాలు తనకు జరిగిన అన్యాయంపై బుధవారం డీజీపీకి రిజిస్టర్ పోస్టు ద్వారా లేఖ పంపినట్లు తెలిసింది.

# లీడర్స్‌కు పుట్టిల్లు బీఆర్ఎస్

## 2001 నుంచి నేతల ఫ్యాక్టరీగా గులాబీ పార్టీ



**ఉద్యమ పార్టీగా పురుడు పోసుకున్న టీఆర్ఎస్.. రాష్ట్ర సాధనతో రాజకీయ పార్టీగా రూపాంతరం చెందిన బీఆర్ఎస్ ఎందరో నేతలను తయారు చేసిన పొలిటికల్ ఫ్యాక్టరీగా నిలుస్తున్నది. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రసాధన కోసం ఏర్పడిన టీఆర్ఎస్‌లో ఉమ్మడి జిలా నుంచి నూతన నాయకత్వం పుట్టుకు వస్తూనే ఉన్నది. రాజకీయంగా ప్రతికూల పరిస్థితులు ఎదురైన ప్రతి సందర్భంలోనూ బీఆర్ఎస్ కొత్తవారికి అవకాశం ఇస్తూ వచ్చింది. కీలక నేతలతోపాటు వేల సంఖ్యలో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాన్ని తయారు చేసింది. కొందరు కీలక పదవులు సైతం అనుభవించి పార్టీకి ద్రోహం చేసి వెళ్లిపోయినా సొంత బలంతో మళ్లీ నేతలను తయారు చేస్తూనే ఉంది. వ్యక్తిగత స్వార్థం కోసం ఉద్యమం పార్టీకి ద్రోహం చేసే కొందరు పార్టీలు మరినా బీఆర్ఎస్ ప్రతిసారీ నూతన బలాన్ని కూడగట్టుకుని ముందుకు సాగుతున్నది.**

- ఉమ్మడి జిల్లాలో అన్ని స్థాయిల్లో నేతల తయారు
- బీఆర్ఎస్‌తోనే రాజకీయ ఆరంగేట్రం చేసిన నేతలెందరో..
- వేల సంఖ్యలో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వం
- కొందరు పార్టీలు మారినా పటిష్టంగా గులాబీ సేన

2001లో టీఆర్ఎస్ ఆవిర్భావంతో కొత్త నేతలు తయారయ్యే ప్రక్రియ మొదలైంది. ఉద్యమ కాలంలో విద్యార్థి, రైతు, కార్మిక, న్యాయవాద వర్గాల్లో పనిచేస్తూ అనతి కాలంలోనే పలువురు ముఖ్యమైన నేతలుగా ఎదిగారు. అధినేత కేసీఆర్ పిలుపు మేరకు రాష్ట్ర సాధన కోసం అప్పటి వరకు రాజకీయాలతో సంబంధం లేని వారు సైతం ఎందరో గులాబీ జెండా పట్టుకుని సైన్యంలా కదిలారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వేలాది మంది నేతలుగా పుట్టుకొచ్చారు. వీరిలో ఉద్యమ కాలం నుంచి నేటి వరకు ఎందరో ప్రజాప్రతినిధులుగా సైతం చట్టసభలకు ఎన్నికయ్యారు. మరికొందరు ఉద్యమకారులు ప్రభుత్వంలో ఇతర పదవులు పొందారు. 2001లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల నాటి నుంచే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో టీఆర్ఎస్ కొత్త రాజకీయ చరిత్రకు శ్రీకారం చుట్టింది. పార్టీ ఆవిర్భవించిన తొలి ఎన్నికల్లోనే అప్పటి టీఆర్ఎస్ బలపరిచిన వారిలో అత్యధిక మంది గ్రామపంచాయతీ వార్డు సభ్యులుగా, సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. అదే ఏడాది ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులుగా ఎన్నికైన వారు ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో సైతం కౌన్సిలర్లుగా గెలిచి సత్తా చాటారు. 2001 నుంచి ఇటీవల జరిగిన ఎన్నికల వరకు ప్రతి ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తరఫున కొత్త నేతలు అవతరిస్తూనే ఉన్నారు. రాజకీయంగా అనుభవం ఉన్న కొందరు పార్టీలోకి వచ్చినా గులాబీ పార్టీ నుంచి తొలిసారిగా చట్టసభలకు ఎన్నికైన వారున్నారు. మరికొందరు ఎంపీలుగా, ఎమ్మెల్సీలుగా, ఎమ్మెల్యేలుగా, జడ్పీ చైర్మన్లుగా ఎన్నికయ్యారు. గ్రామ, మండల స్థాయిలో ప్రస్తుతం కీలక నేతలుగా ఉన్న వారిలోనూ గణనీయంగా బీఆర్ఎస్‌తో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన వారు ఉండడం విశేషం.

### తొలి ఎన్నికల్లోనే సత్తా చాటిన టీఆర్ఎస్..

2001లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్ఎస్ తొలిసారిగా బరిలోకి దిగింది. ఆ ఎన్నికల్లో ఆలేరు, భువనగిరి, మునుగోడు నియోజకవర్గాల్లో సత్తా చాటుతూ పలు ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంది. 2004 ఎన్నికల్లో ఆలేరు నుంచి టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కుడుదుల నగేశ్ ఎన్నికయ్యారు. ఉప ఎన్నికల్లోనూ మరోసారి నగేశ్ విజయం సాధించి టీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా చట్టసభల్లోకి అడుగుపెట్టారు. ఇలా.. గతంలో కొద్దిపాటి రాజకీయ నేపథ్యం ఉన్నా టీఆర్ఎస్ నుంచి తొలిసారిగా చట్ట సభలకు ఎన్నికైనవారు ఎందరో ఉన్నారు. కేసీఆర్‌తో ఉద్యమంలో అడుగులో అడుగేస్తూ నడిచిన గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, గొంగిడి సునీత, గాదరి కిశోర్ కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, వేముల వీరేశం, పైళ్ల శేఖర్‌రెడ్డి వంటి ఉద్యమ నేతలంతా 2014లో తొలిసారి ఎమ్మెల్యేలుగా బీఆర్ఎస్ నుంచి అసెంబ్లీలో అడుగుపెట్టడం విశేషం. భువనగిరి ఎంపీగా డాక్టర్స్ జేఏసీకి నాయకత్వం వహించిన డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ లోక్‌సభలో తొలిసారిగా అడుగుపెట్టారు. వీరెవరికీ గతంలో రాజకీయ వారసత్వం లేదు. కేవలం టీఆర్ఎస్‌తోనే వీరి రాజకీయ ఉన్నతి సాధ్యం కావడం విశేషం. ఇక ఉద్యమంలో యువజన విభాగంలో కీలకంగా ఉన్న కర్నె ప్రభాకర్, రైతు విభాగంలో పనిచేసిన ఎలిమినేటి కృష్ణారెడ్డి ఎమ్మెల్సీలుగా మండలిలో తొలిసారి ప్రాతినిథ్యం వహించారు. ఇక మధ్యలో కలిసివచ్చిన వారు సైతం తొలిసారిగా చట్టసభలకు వెళ్లగలిగింది బీఆర్ఎస్‌తోనే కావడం విశేషం. టీడీపీలో సుదీర్ఘకాలం పనిచేసినా బీఆర్ఎస్‌లోకి వచ్చాకే బడుగుల లింగయ్యయాదవ్ రాజ్యసభలో అడుగు పెట్టగలిగారు. పారిశ్రామికవేత్త తేర చిన్నపరెడ్డి, కాంగ్రెస్ నేత ఎంసీ కోటిరెడ్డి తొలిసారిగా బీఆర్ఎస్ నుంచే ఎమ్మెల్సీ కాగలిగారు. 2018లో ఏకంగా తొమ్మిది మంది బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలయ్యారు. కొత్తగా బొల్లం మల్లయ్యయాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి, నోముల భగత్ వంటి వాళ్లు తొలిసారిగా అసెంబ్లీలో అధ్యక్ష అనే అర్హత బీఆర్ఎస్‌తోనే సాధ్యమైంది. బండా నరేందర్‌రెడ్డి వంటి ఉద్యమ సీనియర్ నేత జడ్పీ చైర్మన్ అయ్యారు. గుజ్జ దీపిక, ఎలిమినేటి సందీప్ రెడ్డి వంటి వారికి జడ్పీ చైర్మన్ అవకాశం బీఆర్ఎస్‌తోనే సాధ్యమైంది. ఇక ఉద్యమంలో కీలకంగా పనిచేసిన దూదిమెట్ల బాలరాజుయాదవ్, సోమ భరత్‌కుమార్, మేడె రాజీవ్‌సాగర్, కంచర్ల రామకృష్ణారెడ్డి, పల్లె రవికుమార్, తిప్పన విజయసింహారెడ్డికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్లుగా అవకాశం కల్పించింది. ఇక్కడ ప్రస్తావించిన వారే కాకుండా ఇలా ఉద్యమంలో టీఆర్ఎస్‌తో కొత్తగా ఎదిగిన నేతలతోపాటు మధ్యలో కలిసివచ్చిన ఎందరికో రాజకీయంగా చట్టసభల్లో ఎన్నో అవకాశాలు కల్పించిన ఘనమైన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉన్నది. ఇక జిల్లా స్థాయిల్లోనూ స్థానిక సంస్థల్లో, డీసీసీబీ, డీసీఎంఎస్, మార్కెట్ కమిటీల్లోనూ వేలాది మంది ప్రజాప్రతినిధులకు బీఆర్ఎస్ వేదికగా నిలుస్తోంది.

వీటన్నింటి పరిణామాల నేపథ్యంలో టీఆర్ఎస్ తరఫున అనేక మంది ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కాగా, అందులో కొందరు పార్టీ పరంగా పదవులు అనుభవించి పార్టీకి ద్రోహం చేసి ఇతర పార్టీల్లో చేరినా.. గులాబీ పార్టీ ఎన్నడూ బలం కోల్పోలేదు. పైగా ఇలాంటి సందర్భాల్లో మరింత సమర్థవంతమైన కొత్త నేతలెందరో అధినేత కేసీఆర్ నాయకత్వంలో తయారవుతూనే వచ్చారు. అందుకే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ పొలిటికల్ ఫ్యాక్టరీగా నిరంతరం వెలుగొందుతూనే ఉన్నది.




# గంజాయి ముఠా అరెస్ట్

## ఒడిశా నుంచి షోలాపూర్‌కు తరలిస్తుండగా రూ.80లక్షల గంజాయి స్వాధీనం


పంతంగి వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టు బడిన గంజాయి

చౌటుప్పల్, జూన్ 26 : ఒడిశా నుంచి మహారాష్ట్రలోని షోలాపూర్‌కు గంజాయి తరలిస్తున్న ముగ్గురిని ఎల్‌బీనగర్ జోన్ ఎస్‌ఓటీ, చౌటుప్పల్ పోలీసులు కలిసి మంగళవారం రాత్రి పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. నిందితుల నుంచి 80.30లక్షల విలువైన 280 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ సీపీ తరుణ్ జోషి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భోసలే అబా మశ్చీంద్ర, అవినాశ్ శివాజీ రాథోడ్, సిద్ధరామేశ్వర్ పూజారీ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. అదే రాష్ట్రానికి చెందిన మరో స్నేహితుడు అజయ్ రాథోడ్ తేజతో కలిసి గంజాయిని సేకరించి విక్రయించడం ద్వారా డబ్బులు సంపాదించడానికి పథకం వేశారు. ఈ క్రమంలో గతంలో ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా అలిమెల తహసీల్‌లోని ఆలూరికోట నుంచి గంజాయిని కొనుగోలు చేశారు. దాన్ని విక్రయించి పెద్దమొత్తంలో డబ్బు సంపాదించారు. దాంతో గంజాయి కోసం ఈ నెల 23న మహారాష్ట్రలోని షోలాపూర్ నుంచి మళ్లీ ఆలూరికోటకు వెళ్లారు. అక్కడ గంజాయి తీసుకొని దొంగ నెంబర్ ప్లేట్లు ఉన్న ఇన్నోవా, స్విఫ్ట్ డిజైర్‌లో అజయ్ తేజ సహకారంతో తరలిస్తున్నారు. విజయవాడ–హైదరాబాద్ రహదారి మీదుగా వెళ్తుండగా.. పక్కా సమాచారంతో ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ, చౌటుప్పల్ పోలీసులు పంతంగి టోల్‌ప్లాజా పట్టుకున్నారు. వారి నుంచి రూ.80.30లక్షల విలువైన 280 కిలోల ఎండు గంజాయి, రెండు కార్లు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

# పరిహారానికి పడిగాపులు

## నృసింహసాగర్ ప్రాజెక్ట్ నిధుల కోసం నిరీక్షణ

- బీఆర్ఎస్ హయాంలోనే 90శాతం పనులు పూర్తి
- రూ.500 కోట్లు అవసరమంటున్న అధికారులు
- ఆరు నెలలు దాటినా పైసా ఇవ్వని కాంగ్రెస్ సర్కార్
- స్వయంగా రేవంత్‌రెడ్డిని కలిసినా ఫలితం శూన్యం
- నిధులిస్తేనే గ్రామాల తరలింపు, పనులు ముందుకు..
- నిధులు విడుదల చేయాలని నిర్వాసితుల డిమాండ్

యాదాద్రి భువనగిరి, జూన్ 26 (నమస్తే తెలంగాణ) : కరువు నేలపై జలధారలు పొంగిపొర్లించేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన నృసింహసాగర్ (బస్వాపూర్) ప్రాజెక్ట్ ముందుకు సాగడం లేదు. నిధుల కొరతతో అటు పరిహారం అందక.. ఇటు పనులు నడవక.. ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ముంపు గ్రామాల ప్రజలు నష్టపరిహారం, పునరావాసం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. సుమారు రూ.500కోట్ల విడుదలకు టోకెన్లు సిద్ధంగా ఉన్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నిధులు విడుదల చేయడంలేదు. ప్రాజెక్ట్ పూర్తయితే 2.50లక్షల ఎకరాలు కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలం కానున్నాయి.

### బీఆర్ఎస్ హయాంలోనే 90శాతం పనులు పూర్తి

యాదాద్రి భువనగిరి జిల్లాలో కాళేశ్వరం జలాలు పరవళ్లు తొక్కించేందుకు నాటి సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారు. ఇందుకోసం బస్వాపూర్ ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ 16వ ప్యాకేజీలో భాగంగా 11.39 టీఎంసీల సామర్థ్యంతో జిల్లాలోని భువనగిరి మండలంలో బస్వాపూర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం అప్పటి ప్రభుత్వం రూ.1,652.26 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకు రూ.1,250 కోట్ల పనులు పూర్తయ్యాయి. మొత్తం జలాశయం, ఎగువ, దిగువ కాల్వలు నిర్మించేందుకు 5,891 ఎకరాల భూసేకరణ చేపట్టారు. బీఆర్ఎస్ హయాంలోనే 90శాతం పనులు పూర్తయ్యాయి.

### పరిహారం చెల్లింపులు ఇలా..

నృసింహసాగర్ రిజర్వాయర్ నిర్మాణంతో భువనగిరి మండలంలోని బీఎన్ తిమ్మాపూర్, యాదగిరిగుట్ట మండలంలోని లప్పానాయక్ తండా, తుర్కపల్లి మండలంలోని చోక్లానాయక్ తండా పూర్తిగా మునిగి పోనున్నాయి. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం అందించేందుకు అధికారులు సర్వే కూడా నిర్వహించారు. బీఎన్ తిమ్మాపూర్ గ్రామంలో మొత్తం 585 ఇండ్లు ఉండగా, సగం మందికి పరిహారం ఇచ్చారు. ఇంకా సగం మందికి పరిహారం అందించాల్సి ఉంది. లప్పానాయక్ తండాకు పూర్తిగా చెల్లించారు. చోక్లానాయక్ తండా వాసులకు పునరావాసం కల్పించాల్సి ఉంది. వీరి కోసం ఇప్పటికే అధికారులు సర్వే నిర్వహించారు. పునరావాసంలో భాగంగా ఎక్కడ భూమి ఎక్కడనేది స్పష్టత రావాల్సి ఉన్నది. అయితే.. పరిహారం చెల్లిస్తేనే ఆయా గ్రామాలను పూర్తిగా తరలించాల్సి ఉంటుంది. గ్రామాల తరలింపులో ఆలస్యం కావడంతో రిజర్వాయర్ నిర్మాణ పనులు తుది దశకు వచ్చినా నిరుపయోగంగానే మారినట్లయింది.


నృసింహసాగర్ రిజర్వాయర్

### కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలం

యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు మండలాల్లో ఇప్పటికే కాళేశ్వరం జలాలు పరవళ్లు తొక్కాయి. నృసింహసాగర్ రిజర్వాయర్‌తో జిల్లాతోపాటు నల్లగొండ జిల్లాలోని పలు మండలాలకు సాగు, తాగు నీరు అందనుంది. ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే 2.5లక్షల ఎకరాలు సాగులోకి రానున్నాయి. ఆలేరు, భువనగిరి నియోజవర్గాలతోపాటు మోత్కూరు, నల్లగొండ జిల్లాలోని రామన్నపేట, చిట్యాల, చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాలు సస్యశ్యామలం కానున్నాయి. అదేవిధంగా బీఆర్ఎస్ సర్కారు నృసింహ రిజర్వాయర్‌ను పర్యాటకంగా కూడా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించింది. ఇక్కడ బోటింగ్, పార్కులు, మ్యూజికల్ ఫౌంటెయిన్లు ఏర్పాటు చేయాలని గతంలో కేసీఆర్ ప్లాన్ చేశారు. యాదగిరిగుట్టకు కూత వేటు దూరంలోనే ఉండటంతో టూరిజం సర్క్యూట్ చేయాలని భావించారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

### నిధులు విడుదల చేయాలి



బస్వాపూర్ ప్రాజెక్ట్‌లో భాగంగా మా ఊరు మునిగిపోతుంది. బీఆర్ఎస్ హయాంలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు చెల్లింపులు చేశారు. పునరావాసం డబ్బులు చెల్లించాల్సి ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజా భవన్‌కు వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించాం. కానీ.. ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదు. పరిహారం చెల్లిస్తేనే గ్రామం నుంచి అందరం తరలివెళ్తాం. ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు విడుదల చేయాలి.

**- ఎడ్ల సత్తిరెడ్డి, ముంపు బాధితుడు, బీఎన్ తిమ్మాపూర్**

### కాంగ్రెస్ ప్రభుత్వం పైసా ఇయ్యలే..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా ప్రాజెక్ట్ కోసం ఒక్క పైసా విడుదల చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా భవన్‌లో గ్రామస్తులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించినా ఇప్పటి వరకు స్పందించలేదు. ఎన్నికల ముందు ప్రస్తుత ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి ఇచ్చిన హామీని తుంగలో తొక్కారు. ఆయన నిధుల విడుదలకు ఎలాంటి చొరవ చూపడంలేదు. ప్రస్తుతం ప్రాజెక్ట్ కోసం సుమారు రూ.500 కోట్లు అవసరం పడుతున్నాయి. ఇందులో ఆర్ అండ్ ఆర్ కోసం రూ.250 కోట్లు, భూ సేకరణకు మరో రూ.250 కోట్ల వరకు నిధులు కావాలి. నిధుల కోసం టోకెన్లు కూడా సిద్ధంగా ఉన్నాయని, డబ్బులు విడుదల చేయడమే తరువాయి అని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

# యాదాద్రి పవర్ ప్లాంటులో విషజ్వరాలు

- 62 మంది కార్మికులకు అస్వస్థత
- వైద్య శిబిరం ఏర్పాటు


యాదాద్రి పవర్ ప్లాంటు దవాఖానలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

దామరచర్ల, జూన్ 26 : మండలంలోని యాదాద్రి పవర్ ప్లాంటులో పనిచేస్తున్న కార్మికులు విషజ్వరాల బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. పలువురు కార్మికులు కొన్ని రోజులుగా జ్వరాలతో బాధపడుతూ పనులు చేయలేక స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. ఈ విషయంపై ప్లాంటు యాజమాన్యం సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేశారు. దాంతో కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు యాదాద్రి పవర్ ప్లాంటులోని ఆసుపత్రిలో డిప్యూటీ డీఎంహెచ్ఓ కేసా రవి ఆధ్వర్యంలో బుధవారం ఐదు వైద్య బృందాలతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ముగ్గురు వైద్యాధికారులు, 50 మంది వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. 464 మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించగా.. అందులో 62 మందికి జ్వరాలు సోకినట్లు గుర్తించారు. వారి నుంచి శాంపిల్స్ సేకరించి జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌కు పంపించారు. కొంత మందిలో డెంగీ లక్షణాలు కనిపించినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం పవర్ ప్లాంటు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి జ్వరాలు సోకకుండా చేపట్టాల్సిన తక్షణ చర్యల గురించి వైద్యాధికారులు వివరించారు. జ్వరాలు తగ్గే వరకు మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని మండల వైద్యాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు.


